క్లుప్తంగా

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌కు నగదు అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇంజేడు గ్రామానికి చెందిన సంకేపల్లి వెంకటచెన్నారెడ్డి కుటుంబ సభ్యులు రూ.30 వేల విరాళాన్ని అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ సోమవారం తెలిపారు.దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

బేతంచెర్ల కమిషనర్ బాధ్యతల స్వీకరణ



హరిప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న సచివాలయ సిబ్బంది

బేతంచెర్ల: నగర పంచాయతీ కమిషనర్‌గా డి. హరిప్రసాద్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన రమేష్‌బాబు ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆత్మకూరులో పనిచేస్తున్న హరిప్రసాద్ బేతంచెర్లకు వచ్చారు. ఆయనకు సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిషన్ మాట్లాడుతూ.. పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇందుకు అందరిసహకారం అవసరమని కోరారు.

వెలుగు ఏపీఎంగా బాధ్యతలు



శ్రీనివాసులకు బాధ్యతలు అప్పగిస్తున్న తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎంగా అడ్డాకుల శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తిరుపాల్‌రెడ్డి నంద్యాల చేయూత విభాగం ఏపీఎంగా బదిలీ అయ్యారు. అక్కడ అదే విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసులు బనగానపల్లెకు వచ్చారు. ఈ మేరకు తిరుపాల్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

దోన్ రూరల్/సంజామల: రైతులకు మంగళవారం నుంచి వారం పాటు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ అనుబంధశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సాగులో మంచి దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన మెలకువలు, యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తలు వివరిస్తారన్నారు. తొలి రోజు డోన్ సబ్ డివిజన్‌లోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే సంజామల మండల పరిధిలోని ముదిగేడు, కమలపురి సచివాలయాల పరిధిలో కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

రైతులకు అవగాహన కార్యక్రమాలు

కొలిమిగుండ్ల:మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి జ్యోతి తెలిపారు. మొదటి రోజున పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె, 25 వ తేదీ యర్రగుడి, బి.ఉప్పలూరు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ చివరి వరకు మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫీల్డ్ విజిట్ చేసి రైతులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందిస్తామని పేర్కొన్నారు.

పలువురు అధికారుల బదిలీలు

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం ఏడేళ్ల పాటు మండలంలో పని చేశారు. బదిలీల్లో భాగంగా రుద్రవరం వెళ్లారు. ఏపీఎం తిరుపాల్‌రెడ్డి నంద్యాల మహిళా మార్టుకు, ఏపీఓ గంగన్న దొర్నిపాడుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. వీరి స్థానాల్లో కొత్తవారిని నియమించాల్సి ఉంది. తహసీల్దార్ కార్యాయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరెడ్డిని ఉయ్యాలవాడకు బదిలీ చేశారు. ఆరుగురు వీఆర్వోలు బదిలీ అయ్యారు. వీరిలో చింతలాయిపల్లె వీఆర్వో సత్యమయ్యను గోస్పాడు మండలం జిల్లెలకు, ప్రసాదరెడ్డిని బెలుం, గూడుబాయి పెట్నికోట, నారాయణ రెడ్డి నందిపాడు, రామసుబ్బయ్య అంకిరెడ్డి పల్లె, ప్రభాకర్ పెద్దవెంతుర్ల, రామ్మోహన్‌ను యర్రగుడికి బదిలీ చేశారు.

కొత్త పింఛన్ కలేనా..!

కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్ల మంజూరు కలగా మిగిలే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా ఇంత వరకు కొత్త పింఛన్లపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్తగా అర్హత సాధించిన పింఛన్ లబ్ధిదారులు దరఖాస్తులు పట్టుకుని రోజూ సచివాలయాల చుట్టూ తిరగడం.. వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది సమాధానం ఇవ్వడం.. నిరాశతో వెనుదిరగడం పరిపాటిగా మారిపోయింది. తాము అధికారంలోకి వస్తే బీసీ, ఎస్టీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆ తర్వాత ఊసే ఎత్తడం లేదు.

- పడిగాపులు కాస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు
- సచివాలయాల్లో ఓపెన్ కాని సర్వర్
- దరఖాస్తు చేసేందుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



కొలిమిగుండ్ల: కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయా అని గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. రోజు గ్రామ సచివాలయాల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛన్ల నమోదుకు సంబంధించి ఇంకా వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల కోసం ఇప్పటికే చాలా మంది అర్హత సాధించారు. ప్రభుత్వం నుంచి కనీస సమాచారం లేకపోవడంతో దరఖాస్తులు పట్టుకుని సచివాలయాల వద్దకు తిరుగుతూనే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న పింఛన్లలో అనర్హత పేరుతో చాలా మందిని తొలగించి వాటి స్థానంలో కొత్త పింఛన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. బనగానపల్లె నియోజకవర్గంలో 82 గ్రామ సచివాలయాలు ఉండగా ఇప్పటి వరకు 37,562 పింఛన్లు ఉన్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్

ఈ ఏడాది ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పింఛన్ల నమోదుకు చెందిన వెబ్‌సైట్ ఆగిపోయింది. తర్వాత ఎన్నికలు, ఫలితాల వెల్లడి, కొత్త ప్రభుత్వం కొలువు దీరడం జరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా ఇంకా వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంపై అర్హులైన లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, తదితర పింఛన్లకు అర్హత సాధించిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్‌లను మంజూరు చేసేది. వలంటీర్ల ద్వారా ఇంటింటి వెళ్లి ధ్రువపత్రాలు సేకరించి అర్హులైన వారికి సచివాలయాల్లో దరఖాస్తు చేయించేవారు. కూటమి ప్రభుత్వం 50 ఏళ్లు నిండిన బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చినా ఆ ఊసే లేకుండా పోయింది. పింఛన్ నమోదుకు వెబ్‌సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందా అని వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఉన్న పింఛన్లు

మండలం	పింఛన్‌ల సంఖ్య
కొలిమిగుండ్ల	7103
అవుకు	6768
కోవెలకుంట్ల	5947
సంజామల	5233
బనగానపల్లె	12,511

ప్రభుత్వం నుంచి సమాచారం లేదు

కొత్త పింఛన్‌లకు సంబంధించి వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. సమాచారం రాగానే అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఓపెన్ కాగానే ఆయా సచివాలయాలకు సమాచారం చేరవేస్తాం.

–ప్రసాదరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం గీతా

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సెయింట్ జోసఫ్స్ పాఠశాల హెచ్ఎం గీతా తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో బాలబాలికలు ప్రతిభ చాటారన్నారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయాయ ఉపాధ్యాయులు ఓబులేసు, హర్ష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: వెంగళాంపల్లి ఫీడర్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం వెంగళాంపల్లి, వెంకటాంపల్లి, ఎన్ రంగాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటింట హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: లోక కల్యాణార్థం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 108 గ్రామాల్లో నవంబర్ 2వ తేదీ వరకు ఇంటింటా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు వికాస భారతి కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. మంగళవారం బేతంచెర్ల పట్టణంలోని వికాసభారతి అధ్యక్షుడు సుజాత శర్మ స్వగృహంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక భావన పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గుండాగోపాలు, మధు మోహన్ రెడ్డి, నాగ మోహన్ రవి, భువనేశ్వరరాజు, గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్యను పరిష్కరిస్తాం



శ్మశాన వాటిక సమస్యపై ఆరా తీస్తున్న ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డి

సంజామల:మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డి హామీ ఇచ్చారు. శ్మశాన వాటికను గ్రామానికి చెందిన జయ రాముడు, లక్ష్మయ్య ఆక్రమించుకున్నారని మూడు రోజుల క్రితం కాలనీ వాసులు నంద్యాల కలెక్టర్ ఆఫీసు ఎదుట నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలసిందే. వారి ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో తహసీల్దార్ అనీల్ కుమార్‌తో కలిసి ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డి సోమవారం విచారణ చేశారు. ఆర్‌డీఓ మాట్లడుతూ.. శ్మశాన వాటిక ఉన్న ప్రదేశం సర్వే నంబర్ 267 రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆర్ఐ వెంగల్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల వినతి



ఎమ్మెల్యే కోట్లకు సమస్యలను వివరిస్తున్న వలంటీర్లు

బేతంచెర్ల: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్లు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సోమవారం బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని బైటిపేటలో తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డోన్ ఎమ్మెల్యేకు వలంటీర్లు తమ సమస్యను విన్నవించారు. తాము విధులకు రాజీనామా చేయలేదని, తమకు తిరిగి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే నెలకు రూ. 10 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, హామీ నెరవేర్చాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



జయరాంను సత్కరిస్తున్న కౌన్సిలర్లు

డోన్: సాధారణ బదిలీల్లో భాగంగా డోన్ మున్సిపల్ కమిషనర్ జయరాం విశాఖపట్నం వెటర్నటీ ఆస్పత్రి ఏడీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ చర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్లు, అధికారులు ఆయన్ను ఘనగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రెండేళ్ల పదవీ కాలంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, పాలకవర్గ సభ్యులు, అధికారుల సహకారం మరిచిపోలేనని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రైల్వే నాగేంద్ర, సుబ్బలక్ష్మి, బుర్రు రమాదేవి, మేకల విమల, మౌలాభి, ఫాతిమాబీ, కళావతి, కోఆప్షన్ సభ్యులు రఫీ, కుమ్మరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్రు శ్రీధర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రాచర్లలో వర్షం కోసం పూజలు



విరాటపర్వం పారాయణం చేస్తున్న పురోహితులు



బొడ్రాయికి అభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల గ్రామంలో సోమవారం వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయంలో పురోహితులు గంగాధర శర్మ విరాటపర్వం పారాయణం చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద ఉన్న బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేలాది బిందెలతో బొడ్రాయికి అభిషేకం చేశారు. అభిషేకం చేసిన నీటి ప్రవాహం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న శెట్టి గారి కుంటలోకి చేరుకునే వరకు నిరంతరాయంగా అభిషేకం చేశారు. ఇలా చేస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని భక్తుల విశ్వాసం.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

దోన్ టౌన్/డోన్ రూరల్: కార్మికులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి తీసుకొచ్చిన 4 కోడ్‌లు రద్దు చేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం బేతంచెర్ల సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ యోచనను కేంద్రం విరమించుకోవాలని కోరారు. కనీస వేతన చట్టాలను అమలు చేయాలన్నారు. అలాగే పాత బస్టాండ్‌లో జులేఖ, నారాయణ, పుల్లయ్య ,అబ్బాస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

జూదరుల అరెస్ట్

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న జూదరులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మెట్టుపల్లె గ్రామ పొలిమేరలోని జీఎన్ఎస్ఎస్ కాలువ వద్ద కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామని చెప్పారు. పోలీసులను చూడగానే పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. గుండ్లశింగవరం గ్రామానికి చెందిన గోగు చెన్నయ్య, అవుకుకు చెందిన సుగాలి తిరుమల నాయక్, మక్కాల నటరాజు, శింగనపల్లెకు చెందిన పాలగిరి జగదబి రాముడు, చెన్నంపల్లెకు చెందిన మల్లయ్యగారి మహేశ్వర రెడ్డి, బసిరెడ్డిగారి శివారెడ్డితో పాటు మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.9500 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న శ్రీరాములును అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ సోమవారం తెలిపారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నేడు ఎర్రగుంట్లలో ప్రజావేదిక

దోన్ రూరల్: మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామంలో మంగళవారం ప్రజావేదిక కార్య క్ర మం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్య క్రమానికి ముఖ్య అతిథిగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు.

గోరుమానుకొండకు బస్సు సౌకర్యం



బేతంచెర్ల: విద్యార్థులు, గ్రామస్తుల సౌకర్యార్థం బేతంచెర్ల నుంచి గోరుమానుకొండకు బస్సు సౌకర్యం కల్పించారు. సోమవారం ఆర్టీసీ అధికారులు, గ్రామస్తులు బస్సుకు పూజలు చేసి సర్వీసును ప్రారంభించారు. ఉదయం, సాయంత్ర వేళల్లో బస్సు నడుపుతామని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు.

పాఠశాలకు టేబుళ్లు విరాళం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలకు వెంకటేశ్ అనే వ్యక్తి రెండు టేబుళ్లు విరాళంగా ఇచ్చారు. వెంకటేశ్ కుమారుడు నిఖిల్ గత ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో స్కూల్ ఫస్ట్‌గా నిలిచాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రూ. 8 వేలు విలువ చేసే రెండు టేబుళ్లను హెచ్ఎం అన్వర్‌కు అందజేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి



పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బనగానపల్లె రూరల్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో స్వచ్ఛతాహీ పక్షోత్సవాల్లో భాగంగా గ్రామ పంచాయతీలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత, ఎంపీడీఓ నాగరాజు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు పనులు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చేతికి గ్లౌజులు, మాస్కులు ధరించాలని తెలిపారు. విధులు ముగిసిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, వైద్యుడు జనార్దన్ ఉన్నారు.

వేడుకగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



పల్లకీ సేవలో ఆలయ సిబ్బంది, భక్తులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వర స్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ముస్తాబు చేసిన పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

నిర్మాణాల అడ్డగింపుపై ఫిర్యాదు





రోడ్డును తవ్వి ఫెన్సింగ్ వేసిన రైతు,సోంపురం రైల్వే ట్రాక్ వద్ద నిలిచిపోయిన అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు

డోన్: మండలంలోని సోంపురం గ్రామం వరకు నిర్మిస్తున్న రహదారి పనులను అడ్డుకుంటున్న వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రాధమ్మ గ్రామస్తులతో కలిసి సోమవారం తహసీల్దార్ నాగమణికి ఫిర్యాదు చేశారు. ఉడుములపాడు గ్రామం పరిధిలోని 44వ జాతీయ రహదారి వద్ద నుంచి బీటీ రోడ్డుకు అడ్డంగా రైల్వే ట్రాక్ ఉందన్నారు. ఈ ట్రాక్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మిస్తున్నందువల్ల ఆవలివైపు ఉన్న వ్యక్తి పూర్వం ఉన్న రోడ్డు తనదంటూ నిర్మాణ పనులకు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రహదారిని ధ్వంసం చేయడమే కాకుండా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలను అడ్డుపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీల మధ్య చిచ్చుపెట్టే కుట్ర



వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు

కోవెలకుంట్ల: వర్గీకరణ పేరుతో రాజకీయ నాయకులు మాల, మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు ఆవుల దేవరత్నం ఆరోపించారు. స్థానిక మార్కెట్ యార్డు రైతు విశ్రాంతి భవనంలో సోమవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2000లో నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టారన్నారు. వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని 2004లో సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. తాజాగా ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టేలా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆవుల సుధాకర్, గోపాజి సత్యం, బొంత మహేష్, మాలే లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ ఆశ పెట్టి కోట్లలో కుచ్చుటోపీ?

డోన్ టౌన్: అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి కోట్లలో నగదు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ఘటన డోన్‌లో చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా డోన్‌లో ఓ కార్యాలయం ఏర్పాటు చేశాడు. ప్రజల నుంచి డిపాజిట్ల రూపంలో సుమారు రూ.10 కోట్లు సేకరించినట్లు సమాచారం. లక్ష రుపాయలు కడితే ప్రతి నెలా రూ.10 వేలు వడ్డీ వస్తుందని ఆశ చూపడంతో అధిక సంఖ్యలో ప్రజలు నగదు డిపాజిట్ చేశారు. పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు ఇతడి ఉచ్చులో చిక్కుకున్నారు. డోన్‌తో పాటు మండలంలోని వెంకటాపురం, గుమ్మకొండ, కృష్ణగిరి మండలం చిట్యాల, గుడెంపాడు, గుత్తి, ,కోడుమూరు, కర్నూలుకు చెందిన వారి నుంచి మూడేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా అధిక మొత్తంలో నగదు సేకరించారని సమాచారం. అయితే కొద్ది నెలలుగా పెట్టుబడిదారులకు వడ్డీ ఆలస్యం కావడం..మరికొందరికి చెల్లించకపోవడంతో అనుమానం వచ్చి ఇతరులతో చర్చిస్తుండగా ఆనోటా ఈనోటా పడి పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో వారు గుత్తికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com